నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, గురువారం 12 సెప్టెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET




ఐసీడీఎస్ అధికారికి పసికందును అప్పగిస్తున్న ఎస్సై నాగన్న

# నేనేమి చేశాను పాపం

- పుట్టిన ఆడశిశువును బస్తాలో పెట్టి వదిలేసిన వైనం
- డోకూరు స్టేజీ సమీపంలో లభ్యమైన పసికందు
- ఐసీడీఎస్‌కు అప్పగించిన పోలీసులు

దేవరకద్ర, సెప్టెంబర్ 11 : లోకాన్ని కూడా చూడని చిన్నారిని బస్తాలో పెట్టిన రోడ్డు పక్కన వదిలేసి కర్కష ఘటన దేవరకద్ర మండలం డోకూరులో చోటుచేసుకున్నది. గ్రామస్తులు, ఐసీడీఎస్ అధికారి సద్దామ్ హుస్సేన్ కథనం ప్రకారం.. డోకూర్ నుంచి దేవరకద్ర సహకార సంఘం అధ్యక్షుడు నరేందర్ రెడ్డి రోజు మాదిరిగానే ఉదయం 6:30 గంటల ప్రాంతంలో వాకింగ్ చేస్తూ వెళ్తుండగా, డోకూరు స్టేజీ సమీపంలోని చేతిపంపు వద్ద చిన్నపిల్ల ఏడుపు విని పించింది. వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించగా, ఓ బస్తాలో అప్పుడే జన్మించిన పసికందు కనిపించింది. బస్తా తీసి చూడగా, చిన్నారికి చీమలు పట్టి ఉండడాన్ని గమనించి వెంటనే అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తకు అప్పగించారు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చాడు. అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి స్థానిక ప్రాథమిక దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. ఎస్సై నాగన్న ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారిని మహబూబ్‌నగర్‌లోని ఐసీడీఎస్ కేంద్రానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వినాయకా.. వీడ్కోలికా..

బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద గణనాథుడి నిమజ్జనం

ఐదు రోజులుగా వాడవాడలా పూజలందుకున్న గణనాథుడు వీడ్కోలు పలికాడు. ముందుగా ఆయా మండపాల వద్ద వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూలు, స్వామి వస్త్రాలకు వేలం నిర్వహించారు. పలుచోట్ల యువత ఉట్లు కొట్టి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ముచ్చటగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను ఉంచి డీజే, కోలాటాలు, సంప్రదాయ నృత్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు.



వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో జీపీఎస్ ద్వారా ఫొటోలను పంపిస్తున్న ఉపాధ్యాయులు

# మొక్కుబడికి రాంరాం

- 9గంటలకు బడి నుంచి జీపీఎస్ ఫొటో
- ఇక ఇష్టానుసార విధులకు ఫుల్‌స్టాప్
- ఉపాధ్యాయుల హాజరుపై కార్యాచరణ
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పెషల్ ఫోకస్
- 19 రోజుల్లోనే 55 మందికి షోకాజ్ నోటీసులు

వనపర్తి, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : సర్కారు బడుల్లో పంతుళ్ల విధుల డుమ్మాకు కళ్లెం వేసేందుకు వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. మూడు నెలలుగా అనేక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేసి ఉపాధ్యాయుల హాజరు నియమావళి సరిగా లేదని గుర్తించారు. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని బడి వేళల్లో ప్రతి ఉపాధ్యాయుడికి జీపీఎస్ ఫొటోను అమలు చేస్తున్నారు. ఈ విధానంతో సర్కార్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరులో మొక్కు'బడు'లకు చెక్ పడనున్నది. వనపర్తి జిల్లాలో దాదాపు 546 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో దాదాపు 35వేల మంది బాలబాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. 2,150 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

***100 పాఠశాలల తనిఖీ..***

జిల్లాలోని దాదాపు 100 పాఠశాలలను స్వయంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. జూన్‌లో బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించారు. వారంలో దాదాపు 8 నుంచి 12 పాఠశాలలను పరిశీలించారు. అంగన్వాడీలు, కేజీబీవీలు ఇలా అన్ని బడులను కలియ తిరిగారు. అక్కడున్న లోపాలను స్వయంగా పరిశీలిస్తూ సవరించేందుకు ప్రయత్నాలను ప్రారంభించారు.

***జీపీఎస్ ఫొటో తప్పనిసరి..***

పాఠశాలకు వెళ్లిన అనంతరం ప్రతి ఉపాధ్యాయుడు జీపీఎస్ ఫొటోను అప్‌డేట్ చేసేలా కలెక్టర్ ఆదర్శ్ సురభి నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలోని పీఎస్, యూపీఎస్, జెడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా వారు వెళ్లిన సమయానికి జీపీఎస్ ఫొటోను బడి ఆవరణ నుంచి తీసి మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ గ్రూపునకు పంపాలి. అలాగే సెలవు పెట్టిన పంతుళ్లు సైతం మరొక గ్రూపులో వారి సెలవును పంపేలా చర్యలు తీసుకున్నారు. ఇలా ఏరోజుకు ఆరోజు వారీగా ఉదయం 9గంటలకు ఎంత మంది ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు, ఎంత మంది సెలవు పెట్టారన్నది స్పష్టంగా తెలిసి పోతుంది. ఆయా గ్రూపుల్లో కలెక్టర్‌తోపాటు డీఈవో ఉండి పరిశీలన చేస్తారు. ఉదయం 9గంటల్లోపు, 9:30 ఆ తర్వాత వచ్చిన ఉపాధ్యాయుల లెక్కను జీపీఎస్ కెమెరా ఫొటోల ద్వారా పక్కాగా పరిగణలోకి తీసుకుంటున్నారు.

***50మందికి షోకాజ్‌లు..***

సమయపాలన పాటించని దాదాపు 50మంది ఉపాధ్యాయులకు డీఈవో కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత ఆగస్టు 22న జీపీఎస్ ఫొటో విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి 11 సెప్టెంబర్ వరకు దాదాపు 19 రోజుల్లో 55 మంది ఉపాధ్యాయులు 9:30 గంటల తర్వాత బడులకు చేరుకున్నారు. రోజు వారీ సమాచారమంతా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నమోదవుతుంది. ఈ మేరకు ఆలస్యంగా వచ్చిన వారందరికీ షోకాజ్ నోటీసులు పంపి వివరణ తీసుకుంటున్నారు. ఇలా ఆలస్యంగా వెళ్లే వారికి చర్యలు తప్పనిసరి ఉండాలని సమయానికి వెళ్లే ఉపాధ్యాయులంతా ఆశిస్తున్నారు. లేదంటే అందరూ ఆలస్యంగా వెళ్లడానికి మొగ్గుచూపుతారన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

***మొదలైన మార్పులు..***

జీపీఎస్ సిస్టమ్ అమలుకు వచ్చిన తర్వాత పరిస్థితులు చాలా మెరుగుపడ్డాయని ఉపాధ్యాయ వర్గాలే చర్చించుకుంటున్నాయి. ప్రారంభంలో కొంత ఇబ్బందిగా ఫీలైనా క్రమంగా కుదుటపడుతున్నారు. రాష్ట్రం లో ఎక్కడా లేని విధానాన్ని ఇక్కడ అమలు చేస్తున్నారని కొందరు గుసగుసలాడుతున్నా.. చాలా మంది ఈ చర్యలను సమర్తిస్తున్నారు. ఇక కొంత మంది ఇప్పటికే రాజకీయ నాయకుల వద్ద ఈ జీపీఎస్ విధానాన్ని ప్రస్తావిస్తున్నప్పటికీ పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా, జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు లేక పోవడం ద్వారా ఇబ్బందులున్నాయి.



కంచిరావుపల్లి జెడ్పీ పాఠశాలలో ఫొటోను అప్‌డేట్ చేస్తున్న ఉపాధ్యాయులు



చిన్నోనిపల్లి రిజర్వాయర్ నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## కరకట్ట పనులు
# పటిష్టంగా చేపట్టాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- చిన్నోనిపల్లి రిజర్వాయర్ పరిశీలన

అయిజ, సెప్టెంబర్ 11 : నెట్టెంపాడ్ ప్రాజెక్టు పరిధిలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ కరకట్టను పటిష్టంగా చేపట్టాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం గట్టు మండలంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను అయిజ మండల బీఆర్‌ఎస్ నేతలు, రైతులు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే విజయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తున్నదని, 150 మీటర్ల పొడవు, 4 అడుగుల మేర కరకట్ట పూర్తి చేయాల్సి ఉన్నది. రిజర్వాయర్ నిండుగా మారడంతో కట్ట తెగితే అయిజ మండలంలోని టీటీదొడ్డి, కొత్తపల్లి, సింధనూర్ గ్రామాల పరిధిలోని భూముల్లో పంటలు నీట మునగడం తోపాటు భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అధికారులకు వివరించారు. ఇప్పటికే ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో పాటు తాను కట్ట పటిష్టతపై అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. పెండింగ్‌లో ఉన్న కరకట్ట పనులు ఏ మేరకు జరిగాయో చెప్పాలన్నారు. సాధ్యమైనంత త్వరగా కరకట్ట పనులు పూర్తి చేసి దిగువ ప్రాంతాల రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరమున్నదన్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్ లింక్ కెనాల్ పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. 99, 100 ప్యాకేజీ కింద రిజర్వాయర్ నుంచి అయిజ మండలంలోని సింధనూర్ సమీపంలో ఆర్డీఎస్ కెనాల్‌కు లింక్ కెనాల్ ఏర్పాటు చేస్తే ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందించే అవకాశం ఉందన్నారు. 6 కిలో మీటర్ల లింక్ కెనాల్ కోసం ఎమ్మెల్సీ చల్లా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదించారని, గతంలో పంపిన ప్రతిపాదనలు ఇరిగేషన్ ఉన్నతాధికారులు త్వరగా పంపేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. కర్ణాటకలోని ఆర్డీఎస్ హెడ్ వర్క్స్ నుంచి నీటి విడుదల నిలిచిపోతే చిన్నోనిపల్లి లింక్ కెనాల్ ద్వారా ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడానికి ఆస్కారం ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగిన రోడ్లు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు, మాజీ జెడ్పీటీసీ చిన్న హన్మంతు, నేతలు రంగారెడ్డి, నర్సింహారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఉమేశ్ గౌడ్, శివకుమార్, డైరెక్టర్ హుస్సేని, బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు పల్లయ్య, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జడ్జి కవితాదేవి

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి
- గద్వాల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల పరిశీలన

నమస్తే ఎఫెక్ట్

గద్వాల, సెప్టెంబర్ 11 : జిల్లా కేంద్రంలోని అర్బన్ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై 'విద్యార్థుల పానీపాట్లు' కథనం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. దీనిపై ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితాదేవి స్పందించారు. బుధవారం అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, వంట గదిని పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జడ్జి దృష్టికి విద్యార్థులు పలు సమస్యలు తీసుకొచ్చారు. ప్రహరీ లేక విషసర్పాలు వస్తున్నాయని, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, తరగతి గదుల కొరత లేని సమస్యంటూ లేదని వాపోయారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పీయూకు పేటెంట్

- పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్‌కు అరుదైన గుర్తింపు
- ఆరేండ్ల నిర్విరామ కృషికి దక్కిన ఫలితం
- న్యాక్ గ్రేడింగ్‌లో కీలకంగా మారనున్న పేటెంట్ నం.549951



ప్రయోగశాలలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, స్కాలర్ స్వాతి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 11 : పర్యావరణ అనుకూల మందుల తయారీలో ఉపయోగించే కారకాలు పీయూ రసాయనశాస్త్ర విభాగాధిపతి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తయారు చేయడం వల్ల పాలమూరు విశ్వవిద్యాలయానికి ఇండియన్ పేటెంట్ రైట్ లభించింది. పేటెంట్ అనేది చట్టపరమైన మేధో సంపత్తి హక్కు. '1-బ్రోమో-4డై మీథైల్ పిరిడీనియం బ్రోమైడ్, 1-ఐయాడో-4డై మీథైల్ పీరిడినియం ఐయాడైడ్' అనే నూతన రేయజెంట్స్ తయారు చేయడం ద్వారా పేటెంట్ హక్కుపొందారు. ఈ మేధోసంపత్తి వినియోగించి సామాన్య మానవుడికి, సమాజానికి అతి తక్కువ ధరలో ఔషధాలు అందించవచ్చు. సాధారణ ల్యాబ్‌లలో ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనలో వాడే ఔషధాల తయారీ, వాటి చర్యాశీలత పెంచవచ్చు. ఎకో ఫ్రెండ్లీ కారణాలు తయారు చేయడం, గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలకు అనుగుణంగా డ్రగ్ పరిశ్రమల్లో ఇవి ఎంతో ఉపయోగపడతాయి

***ఆరేళ్ల శ్రమకు దక్కిన ఫలితం..***

నిర్విరామంగా ఆరేండ్లు అనేక రకాలైన పబ్లికేషన్స్‌కు సంబంధించిన సారాంశాన్ని వడపోసి నూతన ఆవిష్కరణకు ప్రయోగకర్త డా. చంద్రకిరణ్ శ్రీకారం చుట్టారు. ఆయన తన సొంత నిధులు వెచ్చించడంతోపాటు పీహెచ్‌డీ స్కాలర్ స్వాతి ఫెలోషిప్ ద్వారా పొందుతున్న స్కాలర్‌షిప్ నుంచి 50శాతం నిధులను మొత్తం సుమారు రూ.8లక్షలకు పైగా ఖర్చు చేసి సక్సెస్ సాధించారు. పర్యావరణ సహిత కొత్త కారకాలు కనుగొన్నారు. చెన్నై పేటెంట్ అసోసియేషన్, బాంబే పేటెంట్, ఢిల్లీ పేటెంట్ అసోసియేషన్స్‌లో అన్ని రకాల సందేహాలు నివృత్తి చేయడం, పరిశోధనాపరంగా ఎదుర్కొన్న ఇబ్బందులను, ఆన్‌లైన్ అడ్డంకులను అధిగమించి విజయం సాధించారు. ఈ ప్రయోగం అంతా నీటిలో, గది ఉష్ణోగ్రత వద్దే చేయడంతో ప్రత్యేక ల్యాబొరేటరీల అవసరం కూడా అంతగా ఉండదు. కారకాల వల్ల ఎటువంటి హానీ జరగదు. సమాజానికి ఉపయోగపడేలా వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో చేసిన కృషికి పేటెంట్ రావడం చాలా సంతోషంగా ఉందని, ఇందులో తన స్కాలర్ స్వాతి పాత్ర గణనీయమైనదని పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తెలిపారు.

***వర్సిటీకి ఉపయోగాలు..***

ఈ పేటెంట్ లభించడం పాలమూరు విశ్వవిద్యాలయానికి అన్ని విధాలుగా ఉపయుక్తం కానున్నది. ముఖ్యంగా ఈ పేటెంట్ వాడుకోవాలంటే పరిశ్రమలు, భారీ మెడిసిన్ ఫ్యాక్టరీలు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. కంపెనీలు, పరిశ్రమలు చెల్లించే రాయల్టీలో 60 శాతం నిధులు యూనివర్సిటీకి చెందనున్నాయి. ప్రయోగకర్తకు 40 శాతం అందుతాయి. న్యాక్‌లో ఈ పేటెంట్ వల్ల పాయింట్స్ పెరుగుతాయి. తద్వారా మెరుగైన గ్రేడింగ్ సాధించేందుకు అవకాశం కలుగుతుంది. ప్రాజెక్టు ఫండింగ్‌కు ఉపయోగపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా పీయూకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. సమాజానికి, సామాన్య మానవుడికి అతి తక్కువ ధరలో మందులు అందుతాయి.

# మత్తు.. గమ్మత్తు..!

- పదార్థం ఏదైతేనేమీ కిక్కు ఎక్కిందా? లేదా? అన్నదే ముఖ్యం
- 'హీ టెక్స్' మత్తులో మునిగితేలుతున్న యువత
- నయా ట్రెండ్‌కు శ్రీకారం చుట్టిన మాదక ద్రవ్య బాధితులు





హీటెక్స్ కెమికల్

నారాయణ పేట, సెప్టెంబర్ 11 : గంజాయి కొట్టడం అయితేనేమి.. హెరాయిన్, కొకైన్ పదార్థం సేవించడం అయితేనేమి.. పెట్రోల్, వైట్నర్ వాసన పీల్చడం అయితేనేమి కిక్కు ఎక్కిందా లేదా అన్నదే మాదక ద్రవ్య బాధితులకు ముఖ్యం. ఇందులో గంజాయి, హెరాయిన్, కొకైన్ పదార్థాలు దొరకడం అంత సులువైన విషయం కాకపోవడంతో పెట్రోల్, వైట్నర్‌ల వానన పీల్చుతున్నారని చెప్పవచ్చు. ఒక గుడ్డలో పెట్రోల్ చుక్కలు వేసి అవసరమైనప్పుడల్లా పీల్చుతూ.. మత్తులో జోగుతున్నారు. అదే సమయంలో వైట్నర్ వాసనను పీలుస్తూ మత్తు ఫీల్ అవుతున్నారు. ఇలా మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువత తాజాగా నయా ట్రెండ్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఎవరికి అనుమానం రాదు.. పైగా సులువుగా అందుబాటులో లభిస్తుండడంతో ప్లైవుడ్ పై డెకోలం అంటించేందుకు ఉపయోగించే హీటెక్స్ అనే సల్యూషన్‌ను మత్తు పదార్థంగా ఉపయోగిస్తున్నారు. ప్లైవుడ్ దుకాణాల్లో రూ.150కి 250 మిల్లీ లీటరు లభించే హీటెక్స్‌ను ఒక కవర్‌లో వేసుకొని అందులో గాలి ఊదడం ద్వారా వచ్చే ఒక రకమైన గాలిని పీలుస్తూ మత్తులో జోగుతున్నారు. ఎక్కువశాతం యువకులు హీటెక్స్ బారిన పడుతున్నారని సమాచారం. ఇటీవల నారాయణపేట జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల్లోనూ మత్తు బానిసలు పెరిగినట్లు తెలుస్తుంది. ఇందులో ఎక్కువశాతం యువతే ఉన్నట్లు సమాచారం. నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్లైవుడ్ దుకాణాల్లో ఇటీవల హీటెక్స్ కొనుగోళ్లు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవంగా ఆ వ్యాపారులు కూడా మొదట్లో ప్లైవుడ్ పనుల్లో ఉపయోగిస్తున్నారులే అనుకున్నారు. కానీ కొనుగోలు చేసిన వాళ్లే తిరిగి కొనుగోళ్లు చేస్తుండడం, పైగా కార్పెంటర్లకు సంబంధం లేని వారు అందులోనూ యువకులు ఉండడంతో ఎందుకు కొనుగోళ్లు చేస్తున్నారని కొంతమంది ప్లైవుడ్ దుకాణదారులు ఆరా తీయగా అసలు విషయం వెలుగు చూసింది. మత్తుకు బానిసలైన యువకులు తమ జీవితాన్ని బుగ్గి పాలు చేసుకుంటున్నారు. వాస్తవంగా 'నమస్తే తెలంగాణ' ఈ కథనాన్ని వెలుగులోకి తెచ్చేంత వరకు కూడా బహుశా పోలీసులకు హీటెక్స్ బారిన పడి యువకులు మత్తులో జోగుతున్నారనే విషయం గురించి తెలియదని సమాచారం. కేవలం గంజాయిపై దృష్టి సారించిన పోలీసులు హీటెక్స్ కొనుగోలుదారులపై దృష్టి పెట్టకపోవడం అందుకు కారణంగా చెప్పవచ్చు. నిజంగా తెలిసి ఉంటే ఇప్పటికే ఆ వైపు చర్యలు తీసుకునే వారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఆ వైపుగా దృష్టి సారించి, ఇప్పటికే హీటెక్స్ కొనుగోలు చేసి, దాని బారిన పడి, పెడదారిన పడిన యువకుల వివరాలు సేకరించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం తద్వారా వారిలో సత్ప్రవర్తన తీసుకొచ్చి వారి జీవితాన్ని కాపాడవలసిన అవసరం ఎంతో ఉంది. అదే సమయంలో ప్లైవుడ్ దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేసి కేవలం కార్పెంటర్‌లకు మాత్రమే హీటెక్స్ విక్రయించే విధంగా ఆదేశాలు జారీ చేయడంతోపాటు ప్లైవుడ్ దుకాణాల్లో నిఘా ఉంచడం ద్వారా కొంత వరకైనా హీటెక్స్ మత్తుకు బానిసలైన వారిని కట్టడి చేసే అవకాశముంది. తమ పిల్లలకు ప్యాకెట్ మనీ ఇస్తున్న వారి తల్లిదండ్రులు అదే సమయంలో తమ పిల్లల ప్రవర్తనలపై కూడా ఓ కన్నేసి ఉంచడం ద్వారా పెడదారిన పడకుండా జాగ్రత్త పడే అవకాశం లేక పోలేదు.

## గణేశ్ లడ్డూ @ రూ.9.11 లక్షలు

- కోస్గి వేలంలో హరిబృందానికి..

మద్దూరు(కోస్గి) సెప్టెంబర్ 11 : వినాయకుడి లడ్డూకు రికార్డు స్థాయి ధర పలికింది. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో ప్రతిష్ఠించిన గణేశుడు బుధవారం నిమజ్జనానికి తరలి వెళ్లాడు. అంతకుముందు లడ్డూకోసం నిర్వహించిన వేలం పోటాపోటీగా సాగింది. కోస్గికి చెందిన కొడిగంటి హరి బృందం రూ.9.11 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నది.

## కొనసాగుతున్న వరద

గద్వాల/అయిజ, సెప్టెంబర్ 11 : కృష్ణా, తుంగభద్ర నదులకు వరద కొనసాగుతున్నది. జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1,16,000 కూసెక్కులు వస్తుండగా.. 11 గేట్లు ఎత్తి దిగువకు 1,12,679 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.152 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఎడమ కాల్వకు 735, కుడికాల్వకు 170 క్యూసెక్కులు వదులుతుండగా.. ఐదు యూనిట్లలో 32,993క్యూసెక్కులతో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. కర్ణాటకలోని ఆల్మట్టి డ్యాంకు ఇన్‌ఫ్లో 72,152 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 60,000 క్యూసెక్కులు, నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 40,000 క్యూసెక్కులు ఉండగా 4 గేట్ల ద్వారా 19,920 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 27,861 క్యూసెక్కులు వస్తుండగా.. 6 గేట్లు తెరిచారు. అవుట్‌ఫ్లో 26,478 క్యూసెక్కులు, ఆర్డీఎస్ ఆనకట్టకు 30,387 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 29,750 క్యూసెక్కులు నమోదైంది.

ఇండ్ల మధ్యే మురికికూపం



దారి ఇలా ఉంటే వెళ్లేదెలా..?



ఫొటోగ్రాఫర్ గద్వాల, సెప్టెంబర్ 11



ముసురుకున్న దోమలు

# కాకులారం.. మురికికూపం

- రోడ్లపైనే మురుగునీరు
- పట్టించుకోని అధికారులు

పల్లెల్లో పారిశుధ్యం పూర్తిగా కొరవడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతితో గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే పట్టింపు కరువైంది. దీంతో ఎక్కడకక్కడ చెత్త పేరుకుపోవడం.. రోడ్లపైనే మురుగు నీరు నిల్వ ఉండడం దర్శనమిస్తున్నాయి. తీవ్ర అపరిశుభ్రతతో ఇదే కోవలోకి గద్వాల జిల్లా కాకులారం చేరింది. గ్రామంలోని వీధులు, రోడ్లను చూస్తే మురికి కూపంగా కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీళ్లు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. దృష్టి సారించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగంతా రోడ్లపైనే పారుతున్నదని, ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.